అంతేకాదు —
మన శాంతినగర్‌కు, కను
చూపు మేరలో 224
ఎకరాల విస్తీర్ణంలో
సామాజిక ఆరోగ్యశాస్త్ర
విభాగం వారు, వారి
శిక్షణ మరియు పరిశోధనా
కేంద్రాన్ని నిర్మించడానికి
చురుకుగా ఏర్పాట్లు
చేస్తున్నారు, ప్రపంచ ఆరోగ్య
సంస్థ వారి సౌజన్యంతో.
అంటే....
శాంతి నగర్‌కు ముందు
ముందు మంచి భవిష్యత్తు
ఉందన్నమాట...



# పూజాపుష్పం

అదొక తృప్తి... ఆనందం... కళ్ళల్లో వెలుగు... భావబంధురంగా ఒకానొక నిశ్చలస్థితికి చేరుకున్న మనస్సు...తన వృత్తికీ, ప్రవృత్తికీ, లక్ష్యానికీ, గమ్యానికీ ఫలితం చేకూర్చగలుగుతున్నాననే భావం...సమగ్ర నిర్దుష్ట సాధన కోసం నిరంతర కృషి - దీక్షా-ఆర్తీ-ఆరాధనా-ఆకాంక్షా సేవాభావం... దివ్యత్వానికీ, మానవత్వానికీ అచంచలమైన, నిష్కపట మైన సేవాభావమే ఆలంబన...మాధవుని పట్ల, మానవుని పట్ల, ఆ భావమే జీవితపరమార్థమూ- ఆదర్శమూ- ఒక్కొక్క ప్రాణిలో వెలిగే తేజః పుంజాన్నే దైవంగా భావించే జన్మే ధన్యమూ- పవిత్రమూ.

ఆమె ఒక పూజా పుష్పం. దైవ సన్నిధిలో మాలా కైంకర్యం ఆమె కర్తవ్యం. తెల్లారి లేస్తూనే స్వామివారి వనములో పూలు...అవి చాలక పోతే ఊళ్ళో ఎవరెవరిళ్ళల్లో ఏ ఏ రకాల పూలు



పూస్తాయో ఆ పూలూ ఏర్చి, కూర్చి తెచ్చేది. రంగు రంగుల పూలలో మధ్యమధ్య తులసిదళాలతో మాలలు కట్టేది. ఎన్ని "వావన"లో...ఎన్ని సువాసనలో...ఉదయరాగాల్లో సంజకెంజాయల్లో, సందె దీపాల వెలుగుల్లో, ఆ మాలల్లో స్వామివారు, అమ్మవారు ఎంత అందంగా వుండేవారో! ఏ వూసులు చెప్పుకునే వారో! వారి కళ్ళల్లో ప్రణయకోపాలూ... వారి తాపచిహ్నాలు... కరుణాంతరంగ సుధా పూరాలు...అమృతజ్యోత్స్నలూ...నిర్నిద్ర రక్షాకవచాలూ...ఆ అలంకారాలూ ఆ సుమమాలికాహారాలు చూస్తున్న కొద్దీ ఆమెకి ఈ మాలికలో సన్నజాజి ఇమడలేదనో, ఆ చేమంతి సరంలో దవనం సరిపడలేదనో, ఆ ముద్దమందారాలు బరువయ్యాయనో, ఆ పారిజాతాలు రక్తి కట్టలేదనో, ఎక్కువయ్యాయనో, తక్కువయ్యాయనో, వెల వెల పోతున్నాయనో...పరిమళాలు వెదజల్లడం లేదనో ఏదో అసంతృప్తి...ఏదో వెలితి...ఏదో ఆర్తి... ఆమె కళ్ళల్లో-ముఖంలో-మనస్సులో-నిన్నటికంటె ఇవాళ, ఇవాళ్టి కంటే రేపు, స్వామి వారూ, అమ్మవారూ, సొగసులు పోవాలి, అందాలు చిందించాలి; ఒయ్యారా లొలికించాలి; వెలిగిపోవాలి. ఆ కొమ్మనీ, ఆ రెమ్మనీ, ఆ చెట్టునీ, ఈ చెట్టునీ, కొంకె కర్రతో వంచి, విదిలించి, కోసి, బుట్టనింపి, రంగు రంగుల పూలు తేవాలి. అమరినంతలో ఏడు వారాల నగలతో దీటుగా రోజుకోవన్నెగా మాలికలల్లాలి. ఆ దివ్య దంపతుల్ని అర్చించాలి. గుండెలు వల్లబడేలా ఆ వక్షః స్థలాన్ని అలంకరించాలి. భుజకీర్తులూ, కంఠాభరణాలు కిరీటాలు, నూపురాలు. ఈ పుమాల కాకపోతాయా? అనుకొనేది. ఓర్పుగా, నేర్పుగా, ముద్దూ మురిపాలుగా సున్నితంగా, సుతారంగా అన్యాపాతిరిక్తం మాలికారచనే ఆమె ధ్యేయం. భుక్తికీ, ముక్తికీ ఇదే ఆమె జీవనోపాధి. ఈ కైంకర్య ప్రతిఫలంగా ఇచ్చే ప్రసాదము, రవంత జీతమూ ఆమె జీవికకి ఆధారాలు.

అన్ని యిళ్ళా ఆమెవే. అందరి ఆపదలూ ఆమెవే. చేతనయినంతలో ఒళ్ళొంచుకోకుండా సాయపడేది. సందడులొచ్చినా, సమారాధనలు జరిగినా, పండుగ, పబ్బాలొచ్చినా, చావులొచ్చినా, తద్దినాలొచ్చినా, ఆ బాలగోపాలం ఆమె సాయం కోరాల్సిందే. తనకు మాలిన ధర్మం అయినా ఆమె అండగా నిలిచేది. ఆ అండే వుండాలిగాని కోట్లు ఆదుకుంటాయా? ఆర్తి తీరుస్తాయా?

కోరికలు తీరని వయస్సులోనే ఆమె ఒంటరి అయింది. పదిమంది తన వాళ్ళున్నా దిక్కులేనిదైంది. ఆశ్రయం కావాలి! ఎందుకు కావాలి? ఎవరి కోసం? తన కోసమే!-నా అన్న పిలుపులేని తనకి ఆశ్రయమెందుకు? అప్పుడే ఆమెకి మాలాకారిణిగా దైవాశ్రయం దొరికింది. దానికి మానవతని జోడించింది. వృత్తి ధర్మాన్ని నిర్వర్తించింది. వయస్సులో వున్నప్పటినుంచి ముదివగ్గయ్యేదాకా ఒకే విధానాన్ని పాటించింది.

ప్రకృతిలో మార్పొచ్చింది. ఓపిక తగ్గింది. విగ్రహాలు వెలాతెలా పోయాయి. వనములో చెట్లే లేవు. ఊళ్ళోనూ అంతే... అంతటా కాగితాల పూలూ...ప్లాస్టిక్ పూలూ... అసలు పూలెందుకు? తనకెవరూ లేరు.

ఆమె పూజా పుష్పం. అది మర్నాటికి నిర్మాల్యం. ఆ పవిత్ర నిర్మాల్యమే శిరోధార్యం కదా!

ఎస్.టి.పి.వి.రామానుజాచార్యులు